క్లుప్తంగా

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

సైదాపురం: మండలంలో పంట కాలువల ద్వారా వరి సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఏవో హైమావతి కోరారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ చెరువు ఆయకట్టు కింద నీటి లభ్యతను బట్టి వరి సాగు చేయాలన్నారు. ముఖ్యంగా ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు గ్రామంలో శనివారం వివిధ శాఖల అధికారులు పౌరహక్కుల దినాన్ని నిర్వహించారు. ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ సమానత్వపు హక్కు ఉందన్నారు. ఆలయాల ప్రవేశం, ఇష్టం వచ్చిన మతాలను స్వీకరించడం వారి ఇష్టమన్నారు. అంటరానితనం చట్టరీత్యా నేరమన్నారు. ప్రజలందరూ ఐక్యతా భావంతో ముందుకు సాగాలన్నారు. దుకాణాలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో రెండు గ్లాసుల విధానాన్ని పాటిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఆర్వో రవిచంద్ర, కార్యదర్శి శ్రీరామ్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

సైదాపురం: పొదుపు మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీఎం రాధ తెలిపారు. ఆమె శనివారం స్థానిక కార్యాలయంలో వీవోవోలకు లకపతి దీదీపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి వీవోవో పరిధిలో 30 శాతం మంది ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించండి

రాపూరు: ఉపాధి హామీ పథకం ద్వారా గుర్తించే పనులు రైతులకు ఉపయోగపడేవిలా ఉండాలని ఏపీడీ శ్రీహరి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మేట్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా నిమ్మచెట్లకు గుంతలు తీయడం, పొలం గట్లపై మొక్కలు నాటడం తదితర పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపితే మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఒక్క జాబ్‌కార్డు వారు బ్యాంకు ఖాతాతో లింక్ చేసి ఉండాలని, జనవరి 1 నుంచి బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని చెప్పారు. ప్రతి కూలీకి వేతనం అధికంగా వచ్చే విధంగా మేట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సుబ్బరాయులు పాల్గొన్నారు.

గూడూరు వాసికి పీహెచ్‌డీ


వేణుసౌజన్యలక్ష్మి

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని నలజాలమ్మ వీధికి చెందిన ఎల్ వేణు సౌజన్యలక్ష్మికి విక్రమ సింహపురి యూనివర్సిటీ శనివారం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఆమె రిటైర్డ్ ప్రొఫెసర్ పి.వెంకటరావ్ పర్యవేక్షణలో ది రోల్ ఆఫ్ ఫైనాన్స్ ఇన్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ రూరల్ మెరైన్ ఫిషర్‌మెన్ – ఏ కేస్ స్టడీ ఆఫ్ కోస్టల్ మెరైన్ హామ్‌లెట్స్ ఇన్ ఎస్ఎస్పీ నెల్లూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఏపీ అన్న అంశంపై పరిశోధన చేశారు. తనకు సహకారం అందించిన కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

చిల్లకూరు : భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ హక్కులను కల్పించిందని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కడివేడు పంచాయతీలో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలను అడ్డుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గిరిజనులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటసూర్యసాయి, ఉపాధి ఏపీవో గిరిబాబు, వీఆర్వోలు రమణయ్య, విద్యావతి, వైఎస్సార్ సీపీ నాయకులు వెదనపర్తి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శివాలయం, నీలకంఠేశ్వరస్వామి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి, చంద్రబాబు కాలనీలో కల్యాణ వెంకటేశ్వర స్వామి, అగ్రహార పేట, బ్రాహ్మణవీధిలో ఉన్న సాయిబాబా, గ్రామదేవత పోలేరమ్మ, మూగాంబికాదేవి, బేరిపేటలోని మహాలక్ష్మమ్మ, పడమటి వీధిలోని అంకాళమ్మ, రాజగోపాలపురంలోని సీతారామాంజనేయస్వామి, తిమ్మాజికండ్రిగలోని అభయ అనుగ్రహ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మత్స్యకారులకు పథకాలపై అవగాహన

కోట: మత్స్యకారులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై శనివారం గోవిందపల్లిపాళెంలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారులు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన, సాగర పరిక్రమ, కిసాన్ క్రెడిట్ కార్డ్ తదితరాల గురించి వివరించారు. ఇన్‌పుట్ పరికరాలు, మత్స్యకారులు వినియోగించే బోట్ల మరమ్మతుల కోసం రూ.2 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.

హోరా హోరీగా క్రీడా పోటీలు


దొరవారిసత్రం : కల్లూరులో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు


కోటలో జరిగిన పోటీల్లో పాల్గొన్న యువకులు

బాలాయపల్లి (డక్కిలి): మండలంలోని జయంపు సచివాలయం పరిధిలోని చెరువు దగ్గర ఉన్న క్రీడా మైదానంలో శనివారం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, వెంకటేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా క్రీడా పోటీలు

డక్కిలి: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శనివారం డక్కిలి మండల వ్యాప్తంగా క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో బెస్ట్ ప్లేయర్స్‌ను ఎంపిక చేసి మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు.

కోలాహలంగా ఆడుదాం ఆంధ్రా

పెళ్లకూరు: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం క్రికెట్, కబడ్డీ, షటిల్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ ఇక్కడ ప్రతిభ చూపే క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల వరకు పాల్గొంటారని తెలిపారు.

జోరుగా సాగుతున్న పోటీలు

దొరవారిసత్రం : స్థానిక బీసీ గురుకుల పాఠశాల, కల్లూరు జెడ్పీ పాఠశాల మైదానాల్లో శనివారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. స్థానిక వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో రఘురామయ్య పోటీలను పర్యవేక్షించారు.

క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించాలి

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు యల్లా సురేష్‌రెడ్డి, పంజాం వసంతమ్మ అధికారులను కోరారు. వారు శనివారం ఎంపీడీవో రజనీకాంత్‌తో కలిసి కర్రబల్లవోలు, చిలమానుచేను సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రేణుక, మస్తానయ్య, లక్ష్మి, సుమ, దీప్తి, పంజాం ప్రతాప్‌కుమార్, గోవిందు, పోలయ్య పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు విశేష స్పందన

కోట: మండలంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు విశేష స్పందన లభిస్తోందని ఎంపీడీవో భవానీ తెలిపారు. ఆమె శనివారం కోట బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం జరిగిన కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలను పరిశీలించారు. హెచ్ఎం సురేంద్రబాబు, పీఈటీలు సంధానీ, వలీఅహ్మద్ పాల్గొన్నారు.

వాలమేడులో క్రీడా సంబరాలు

వాకాడు : మండలంలోని వాలమేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను శనివారం పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో గోపీనాథ్ మాట్లాడుతూ మూడు సచివాలయాల పరిధిలోని 36 జట్లు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, కోకో పోటీల్లో తలపడ్డాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నసీం అలీ, సర్పంచులు శంకరమ్మ, పుల్లమ్మ, ఉప సర్పంచులు కిరణ్‌కుమార్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

యువతకు ప్రోత్సాహం

గూడూరు రూరల్ : యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని నాయకులు తెలిపారు. చెన్నూరు సచివాలయం–2లో శనివారం క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు నాలుగు జట్లు ఎంపిక కాగా వారికి మండల కో ఆర్డినేటర్ శివకుమార్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. సీఆర్‌వో–3 జట్టు విజేతగా నిలిచింది.


వాకాడు: క్రీడా సామగ్రి అందజేస్తున్న అధికారులు, నాయకులు


దొరవారిసత్రం : బీసీ గురుకుల పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


ఓజిలి : క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ సురేష్‌రెడ్డి

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్


ప్రజలకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం వెంకటగిరిలోని 14వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కు మంచి చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పేర్కొన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలతో ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే తీసుకువచ్చారని తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేసి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ కింద వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని గుర్తు చేశారు. వైఎస్ జగమోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, పూజారి లక్ష్మి, కౌన్సిలర్ ఆరి శంకరయ్య, వహిదా, కందాటి కళ్యాణి, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, నాయకులు చింతపట్ల మురళి, శ్రీరామ్ రమణమ్మ, ఓజిలి గురునాథం, యస్దాని పాల్గొన్నారు.


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

క్యాలెండర్ల ఆవిష్కరణ

నూతన సంవత్సరం సందర్భంగా వెంకటగిరి గ్రామ దేవత పోలేరమ్మ, డక్కిలి మండలంలోని అమడూరులోని చెంచులక్ష్మి, దేవుని వెల్లంపల్లి శ్రీ స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి ఆలయాల ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను శనివారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. వెంకటగిరి గ్రూప్ ఆలయాల ఈవో శ్రీనివాసులురెడ్డి, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతుశారద, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఎంపీపీకి గాయాలు

డక్కిలి : స్థానిక సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం ఆటో అదుపుతప్పి ఢీకొనడంతో ఎంపీపీ గోను రాజశేఖర్ గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఎంపీపీ తన సతీమణితో కలిసి ద్విచక్ర వాహనంలో చాపలపల్లి నుంచి బయలుదేరారు. రాపూరు బస్టాండ్‌లో ఆమెకు నెల్లూరు బస్సు ఎక్కించారు. అనంతరం వెంకటగిరిలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు రాపూరు నుంచి బయలుదేరారు. డక్కిలి సబ్‌స్టేషన్ వద్ద వెంకటగిరి వైపు నుంచి రాపూరు వస్తున్న ఆటో అదుపుతప్పి ఢీకొంది. గాయపడిన రాజశేఖర్‌ను స్థానికులు నెల్లూరుకు తరలించారు. మోకాలు కింది భాగంలో ఎముక విరిగినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

నాయుడుపేట టౌన్ : నూతన సంవత్సర వేడుకల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి హెచ్చరించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని పోలీస్ స్టేషన్లలో సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులతో ముమ్మరంగా తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. వేడుకలు నిర్వహించే సంస్థల ప్రతినిధులు జిల్లా ఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా జనాలు గుంపులుగా ఉండరాదని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఆదివారం అర్ధరాత్రి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేలా వేడుకలను జరుపుకోరాదన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించి నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

నేడు వాకాడుకు నేదురుమల్లి రాక

వాకాడు: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం రాత్రి వాకాడుకు రానున్నట్లు ఏఎంసీ చైర్మన్ వాకాటి నాగభూషణమ్మ తెలిపారు. జనవరి 1న వాకాడులో నిర్వహించే నూతన సంవత్సర వేడుకల్లో రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

కండలేరులో 13.024 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరులో శనివారం నాటికి 13.024 టీఎంసీల నీరు ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటరీ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లో లెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కలువాయి: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీటీసీ బి.అనీల్‌కుమార్ రెడ్డి తెలిపారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, వైఎస్ఆర్ క్రాంతిపథం, ఇరిగేషన్, రహదారులు భవనాలు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలపై సమీక్షించారు. ఉపాధి హామీ కింద 2023–2024 ఆర్థిక సంవత్సరంలో 38 పనులను రూ.9,68,741 అంచనాతో చేపట్టాలని తీర్మానించారు. మండలంలో చేతిపంపుల నిర్వహణకు రూ.2,99,127, బోర్ మెటీరియల్, స్పేర్‌పార్ట్స్ కొనుగోలుకు రూ.2,99,974 అనుమతిస్తూ సభ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.లక్ష్మిదేవి, ఉపాధ్యక్షుడు పెంచలనరసారెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్, ఈవోపీఆర్డీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థిక సాయం



వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కాటబట్టిన చిరంజీవికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద శనివారం రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న దొంతుశారద, బాలకృష్ణ దంపతులు శనివారం చిరంజీవి ఇంటికి చేరుకున్నారు. ఆయనను పరామర్శించి రూ.20 వేలు సాయం చేశారు. వైఎస్సార్‌సీపీ నేత రొంటాల చిన్నా పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


డక్కిలి: పాకపూడిలో గర్భిణులు, బాలింతలకు బాలామృతం అందజేస్తున్న రాజేశ్వరి


డక్కిలి: గొట్టికాడులో బాలామృతం అందజేస్తున్న సూపర్‌వైజర్

బాలాయపల్లి (డక్కిలి) : గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తెలిపారు. ఆమె శనివారం గొట్టికాడులో 32 మంది, పాకపూడిలో 15 మంది గర్భిణులు, బాలింతలకు బాలామృతం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మత్స్యకారులకు క్రెడిట్ కార్డుల పంపిణీ


మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తున్న ఎఫ్‌డీవో రఘుబాబు

చిల్లకూరు : రామారెడ్డిపాళెం మత్స్యకార సొసైటీలోని సభ్యులు, సముద్రంలో చేపలు పట్టే మత్స్యకారులకు శనివారం అధికారులు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేశారు. చిల్లకూరు మండల మత్స్య శాఖ అధికారి రఘుబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేస్తున్నాయని తెలిపారు. మత్స్యకారులు క్రెడిట్ కార్డులు, మత్స్యశాఖ అందించిన గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం తీసుకుని సచివాలయంలో పేర్లు నమోదు చేసుకుని దగ్గరలోని బ్యాంకులో సంప్రదిస్తే రూ.10 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు రుణాలు ఇస్తారని తెలిపారు. మండలంలోని కడివేడు, చిల్లకూరు, ముత్యాలపాడు సొసైటీల సభ్యులకు త్వరలో కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తామని చెప్పారు.

పేదలకే అసైన్డ్ భూములు


గూడూరు రూరల్ : అసైన్డ్ భూములను పేదలకు మాత్రమే ఇవ్వాలని రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం అఖిల భారత రైతు కూలీ సంఘం మూడో మహాసభ నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అసైన్డ్ భూముల చట్టం ప్రవేశ పెట్టి పేదలకు ఎంతో మేలు చేసిన ప్రభుత్వం, దానిని సక్రమంగా అమలుచేసేలా చూడాలని అన్నారు.

నేడు వెంకటగిరిలో గడప గడపకూ మన ప్రభుత్వం

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం వెంకటగిరి పట్టణంలోని 15వ వార్డు పోలిశెట్టిగుంట ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కారక్రమం నిర్వహించనున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొనాలని నేదురుమల్లి కార్యాలయ ప్రతినిధులు పేర్కొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం


శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు


పెంచలకోనలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, తిరుప్పావై, పూలంగి సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను నిత్య కల్యాణ మండపంలో కొలువుతీర్చి విశేషంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు.

ఎస్‌ఏఎల్‌సీ చర్చి పీసీసీ నూతన కార్యవర్గం ఎంపిక

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఎస్‌ఏఎల్‌సీ చర్చి పీసీసీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు బిషప్ మైకెల్ బెన్‌హర్ తెలిపారు. చర్చి పరిశుద్ధ పేతురు పౌలు లూథరన్ సంఘ పీసీసీ చైర్మన్‌గా ఓకే మధు, వైస్ చైర్మన్‌గా కే బాబూరావు, కార్యదర్శిగా కేఎంపీ కళాచంద్ర, ట్రెజరర్‌గా కే సురేష్ వరప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా కే ప్రేమ్‌చంద్, కేపీ ప్రేమలత, బీ బెన్‌హర్ జయప్రకాష్, ఎం శైలజ ఎన్నికయ్యారు. సంఘ యువజన విభాగం చైర్మన్‌గా దీపక్ సీండ్రి, వైస్ చైర్మన్‌గా ఎస్ వికాస్, కార్యదర్శిగా పీ అనూష, ట్రెజరర్‌గా కే రీమా అమితా, సంఘం సభ్యులుగా కే అనిల్ కుమార్, బీ జరుష గ్రీస్, కే కీర్తన ఎంపికయ్యారు. కమిటీ సభ్యులు సోమవారం ప్రార్థనల సందర్భంగా ప్రమాణ స్వీకారం చేస్తారని బిషప్ వెల్లడించారు.

ప్రపంచ మానవాళికి శాంతి కలిగించేదే హిందూ ధర్మం


మాట్లాడుతున్న ప్రణవాత్మానంద సరస్వతి

చిల్లకూరు : ప్రపంచ మానవాళికి శాంతి మార్గం చూపించేదే హిందూ ధర్మం అని పూజ్యశ్రీ ప్రణవాత్మానంద సరస్వతి తెలిపారు. తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో శనివారం సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకరికి ఒకరు సహకారం అందించుకుంటూ ప్రపంచ శాంతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమ్మని పూజిస్తే భగవంతుడ్ని పూజించినట్లేనన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సహ కార్యదర్శి కోట సునీల్‌కుమార్, ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యవాహక్ యుగందర్, ఆలయ చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, మాజీ చైర్మన్ ఆనందరెడ్డి, సర్పంచ్ అన్నాడిశెట్టి నాగమ్మ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోట: ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని బీసీ వెల్ఫేర్ తిరుపతి జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక బీసీ బాలురు, బాలికల వసతి గృహాలను పరిశీలించారు. అక్కడి మౌలిక వసతులు, మెనూ తదితరాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. వార్డెన్లు వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర

సైదాపురం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఆదివారం నుంచి జనవరి 16 వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. వారు శనివారం పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.